క్లుప్తంగా

పేదలకు అండగా ఉంటా



ఆర్థిక సాయం అందిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): పేద కుటుంబాలకు వివిధ అవసరాల కోసం అండగా ఉంటానని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. మండలంలోని తిమ్మాపూర్ గ్రామానికి చెందిన వెంచర్ల రాములు, ఎల్లప్ప గారి లింగం అనారోగ్యంతో మృతి చెందారు. దీంతో ఆదివారం బాధిత కుటుంబాలను ఆయన పరామర్శించి, రూ. 5 వేల నగదుతో పాటు నిత్యావసర సరుకులు అందజేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అనుష, ఉప సర్పంచ్ సంధ్య, బీఆర్ఎస్ నాయకులు అంజగౌడ్, లక్ష్మణ్‌యాదవ్, వెంకటేష్ తదితరులు ఉన్నారు.

కార్మికులకు సబ్బుల పంపిణీ



నిత్యావసర వస్తువులు పంపిణీ చేస్తున్న దృశ్యం

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని వెల్మకన్న గ్రామ పంచాయతీలో విధులు నిర్వర్తిస్తున్న పారిశుద్ధ్యం కార్మికులకు ఆదివారం గ్రామ ఇన్‌చార్జ్ సర్పంచ్ కాజిపేట రాజేందర్ సబ్బులు, బెల్లం, కొబ్బరినూనె ఇతర నిత్యావసర వస్తువులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా రాజేందర్ మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు ఆరోగ్యంగా ఉండాలని, నెలకు సరిపడ వస్తువులను పంపిణీ చేసినట్లు తెలిపారు.

15న గజ్వేల్‌లో దీక్షను విజయవంతం చేయాలి

వెల్దుర్తి(తూప్రాన్): ఈనెల 15న గజ్వేల్ లో అనాథల ఆరిగోస దీక్ష చేపట్టనున్నట్లు ఎమ్మార్పీఎస్ – ఎమ్మెస్పీ నాయకులు ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. అనాథల సంక్షేమం కోసం ప్రభుత్వం తక్షణమే చట్టం తీసుకురావాలని డిమాండ్ చేశారు. అనాథల హక్కుల పోరాట వేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ నాయకత్వంలో జరిగే ఈ దీక్షను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

పరామర్శ



జెడ్పీటీసీని పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ సుభాష్‌రెడ్డి

నిజాంపేట(మెదక్): మండలానికి చెందిన జెడ్పీటీసీ పంజా విజయ్‌కుమార్ రెండు రోజుల నుంచి అనారోగ్యంతో బాధపడుతూ యశోద ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. దీంతో ఆదివారం అతనిని ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి పరామర్శించారు.

కొనసాగుతున్న 'ఉపాధి' పనులు



పనులు చేస్తున్న కూలీలు

పెద్దశంకరంపేట(మెదక్): మండలంలోని ఆయా గ్రామాల్లో ఉపాధిహామీ పనులు కొనసాగుతున్నాయి. ఆయా గ్రామాల్లో కట్టు కాల్వలతో పాటు చెరువులో పూడికతీత పనులు చురుకుగా కొనసాగుతున్నాయి. ఉపాధిహామీ పనులను కూలీలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ రఫిఖ్ ఉన్నీసా సూచించారు. ఎఫ్ఏలు కూలీల హాజరు వివరాలను యాప్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు.

శ్రీశైలానికి శివస్వాములు



ఇరుముడులతో శివస్వాములు

చిలప్‌చెడ్(నర్సాపూర్): మండలంలోని ఫైజాబాద్ గ్రామంలోని శివమాల ధరించిన శివస్వాములు శ్రీశైలం బయలు దేరుతున్నామని గురుస్వామి పాండుగౌడ్ తెలిపారు. ఆదివారం కార్యక్రమంలో భాగంగా శివస్వాములు గ్రామంలోని హనుమాన్ మందిరంలోని లింగానికి పూజలు నిర్వహించి, ఆలయ ఆవరణలో ఇరుముడులు ధరించి, శ్రీశైలానికి బయలుదేరారు. ఈ కార్యక్రమంలో సుధాకర్‌గౌడ్, శ్రీనివాస్, భాస్కర్‌రెడ్డి, యాదాగౌడ్, శ్రీకాంత్‌రెడ్డి, వరప్రసాద్‌రెడ్డి, రమేశ్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం.. నాసిరకం

ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు



నాణ్యత లేని బియ్యాన్ని చూపిస్తున్న లబ్ధిదారులు

కొల్చారం(నర్సాపూర్): మండల వ్యాప్తంగా ఈసారి రేషన్ దుకాణాలకు సరఫరా అయిన బియ్యం నాసిరకంగా ఉంటున్నాయి. దీంతో రేషన్ లబ్ధిదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా 22 రేషన్ దుకాణాలకు సుమారు 250 క్వింటాళ్ల బియ్యం సరఫరా అయ్యాయి. వాటిలో మొత్తం తౌడు, చెత్తాచెదారం, నూక కూడా అధికంగా ఉంటున్నాయి. ఈసారి ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు ఉచితంగా ఐదు కిలోల బియ్యం చొప్పున అందిస్తుంది. పేదవాడికి ఇచ్చే బియ్యం ఇలా..నాసిరకంగా ఉంటే తినేది ఎలా అంటూ వారు ప్రశ్నిస్తున్నారు. ప్రస్తుతం రేషన్ దుకాణాలకు సరఫరా అయిన బియ్యం 2020–21 ఖరీఫ్ సీజన్‌కు సంబంధించిన విగా సంచులకు ఉన్న ట్యాగును చూస్తే తెలుస్తోంది. పూర్తిగా ముక్కిపోయి వాసన వస్తున్నాయి. మరోవైపు రేషన్ డీలర్‌కు సైతం సరఫరా అయిన బియ్యం సంచులు ఎక్కడికక్కడ తూట్లు పడి, చిరిగిపోయి ఉండడం కనిపిస్తుంది.

50 కిలోల బియ్యం బస్తాను తూకం వేస్తే 6 కిలోల వరకు తరుగు వస్తుందంటూ లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు.

రేషన్ దుకాణాల ద్వారా పేదలకు సరఫరా అవుతున్న బియ్యం నాణ్యతగా ఉన్నాయా లేదా అన్న విషయాన్ని జిల్లా అధికారులు తనిఖీ చేయకుండా లబ్ధిదారులు సరఫరా చేయడంపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.



రంగంపేటలో ఓ దుకాణంలో 50 కిలోల బస్తా తూకం వేస్తే వచ్చిన విలువ

ఈ బియ్యం తినలేక పోతున్నాం

పేదలకు ఉచితంగా ఇస్తున్న బియ్యం ఏ మాత్రం నాణ్యతగాలేవు. బియ్యంలో నూకలు, మోతాదుకు మించి తౌడు, చెత్తాచెదారం, ముక్కిపోయిన వాసన వస్తున్నాయి. దీంతో ఈ బియ్యం తినలేకపోతున్నాం. పేద ప్రజలకు సరఫరా అవుతున్న బియ్యం అధికారులు పర్యవేక్షిస్తున్నారా అనే సందేహం కలుగుతోంది.

– కిష్టయ్య, రేషన్ లబ్ధిదారుడు, సంగాయిపేట

సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న ఎస్‌ఐ శివకుమార్

నర్సాపూర్: సైబర్ నేరాలపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ శివకుమార్ ప్రజలను కోరారు. ఆయన నర్సాపూర్ ఎస్‌ఐగా శనివారం బాధ్యతలు తీసుకొని ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ... ప్రజల సహకారంతో నేరాలు అదుపు చేస్తామని అన్నారు. కాగా ఇటీవల సైబర్ నేరాలు పెరిగాయన్నారు. గుర్తు తెలియని వ్యక్తులు ఫోన్ చేసి మీ వ్యక్తిగత సమాచారం, ఓటీపీ, ఆధార్ నంబర్లు, బ్యాంకు ఖాతా నంబర్లు అడిగితే ఎవరికీ చెప్పవద్దని ప్రజలకు సూచించారు. సైబర్ నేరాల బారిన పడిన వ్యక్తులు 1930 లేదా 100 నంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని కోరారు. కాగా నేరాల పరిశోధనలో సీసీ కెమెరాలు ఎంతో ఉపయోగ పడుతాయని, ప్రతీ గ్రామంలో వాటిని ఏర్పాటు చేసేందుకు ప్రజలు తమతో సహకరించాలన్నారు. కాగా పట్టణంలో మరో 25 సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు ప్రతిపాదనలు తయారు చేశామని వివరించారు. రోడ్డు ప్రమాదాలు నివారించే దిశగా చర్యలు తీసుకుంటామని, అందులో భాగంగా వాహనదారులు రోడ్డుపై నిర్దేశించిన వేగం కన్న ఎక్కువ వేగంగా వాహనాలు నడుపరాదని చెప్పారు. నర్సాపూర్ మీదుగా ఉన్న జాతీయ రహదారిపై స్పీడ్ గన్స్ ఏర్పాటు చేసి, వాటి ఆధారంగా నిర్దేశించిన వేగాన్ని అతిక్రమించిన వాహనాలను గుర్తించి జరిమానా విధిస్తామని హెచ్చరించారు. చోరీలు అరికట్టేందుకు తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మోడల్‌స్కూల్ ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దశంకరంపేట(మెదక్): పేటలోని మోడల్ స్కూల్‌లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను అర్హులైన విద్యార్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ విఠల్‌నాయక్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 6వ తరగతిలో ప్రవేశాలకు, 7 నుంచి 10 వరకు ఖాళీగా ఉన్న సీట్ల కోసం విద్యార్థులు ఈ నెల 15లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని ఆయన సూచించారు. ఈ అవకాశాన్ని విద్యార్థుల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

కొనసాగుతున్న స్వచ్ఛభారత్



రోడ్లను శుభ్రం చేస్తున్న గ్రామస్తులు

తూప్రాన్: మండలంలోని మల్కాపూర్ ఆదర్శ గ్రామంలో 346వ వారం స్వచ్ఛభారత్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని రోడ్లను శుభ్రం చేసి, పిచ్చి మొక్కలను తొలగించి, గాంధీ విగ్రహ పరిసరాలను శుభ్రం చేశారు. ప్రతీ ఆదివారం 2 గంటల పాటు శ్రమదానం నిర్వహిస్తున్నామని ఉప సర్పంచ్ ఆంజనేయులు గౌడ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో మేకిన్ యువత, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య సిబ్బందిపై చర్యలు తీసుకోవాలి

ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, మెదక్ జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య



మాట్లాడుతున్న నాయకులు

కొల్చారం(నర్సాపూర్): మండల పరిధిలోని రంగంపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్య సిబ్బంది సమయపాలన పాటించడం లేదంటూ టీఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి కృష్ణ, మెదక్ జిల్లా అధ్యక్షుడు దుర్గయ్య ఆదివారం ఓ ప్రకటనలో ఆరోపించారు. ఈ సందర్భంగా వారు ఆదివారం ఆస్పత్రిని సందర్శించారు. సమయంలో ఉదయం 11 గంటలు అవుతున్నా.. ఆస్పత్రి సిబ్బంది ఎవరు కానరాలేదని ఆరోపించారు. సకాలంలో వైద్య సిబ్బంది ఆస్పత్రికి రాకపోవడంతో రోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఆస్పత్రిని పర్యవేక్షించాల్సిన సర్పంచ్, ఎంపీటీసీ, జిల్లా వైద్యాధికారి ఈ విషయంలో తాము ఫిర్యాదు చేసినా.. స్పందించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా వైద్య సిబ్బంది సకాలంలో రోగులకు అందుబాటులో ఉండేలా నడుచుకోవాలని సూచించారు.

'న్యాయం చేయాలి'



నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

శివ్వంపేట(నర్సాపూర్): కొనుగోలు చేసిన పట్టాభూమిలోకి వెళ్లనీయకుండా ఇబ్బందులకు గురిచేస్తున్న వారిపై చర్యలు తీసుకొని న్యాయం చేయాలని మండలంలోని దొంతి గ్రామానికి చెందిన కొత్త సవిత్రీ అన్నారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 702లో 6 నెలల క్రితం 5 గుంటల భూమి కొనుగోలు చేశానని, భూమిలోకి రాకుండా పలువురు ఇబ్బందులు గురిచేస్తుండడంతో కోర్టుని ఆశ్రయించి స్టే తీసుకున్నానన్నారు. పోలీసులు వారికి అనుకూలంగా వ్యవహరిస్తూ.. మాకు సంబంధించిన భూమిలో ఉంచిన కేజీవీల్ ట్రాక్టర్‌ను రాత్రి వేళ బీటీ రోడ్డుకుండా తీసుకెళ్లారని ఆరోపించారు. ఉన్నత అధికారులు స్పందించి, తమకు న్యాయం చేయాలని కోరుతూ పోలీస్‌స్టేషన్ ఎదుట నిరసన వ్యక్తం చేశారు.

బండ ప్రకాశ్‌ను కలిసిన సొసైటీ చైర్మన్



బండ ప్రకాశ్‌కు పుష్పగుచ్ఛం అందిస్తున్న పరమేశ్

చేగుంట(తూప్రాన్): శాసన మండలి డిప్యూటీ చైర్మన్‌గా ఎంపికైన బండ ప్రకాశ్‌ను ఆదివారం రెడ్డిపల్లి సహకార సంఘం చైర్మన్ మ్యాకల పరమేశ్ కలిసినట్లు తెలిపారు. శాసన మండలి వద్దకు వెళ్లిన పరమేశ్ శాసనమండలి వైస్ చైర్మన్‌గా ఎంపికైన బండ ప్రకాశ్‌కు శుభాకాంక్షలు తెలిపి పుష్పగుచ్ఛం అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో దుబ్బాక సొసైటీ చైర్మన్ కైలాష్, దుబ్బాక ఏఎంసీ చైర్మన్ కృష్ణ, బలవంతాపూర్ సర్పంచ్ రాజన్న తదితరులు ఉన్నట్లు తెలిపారు.

నచ్చిన క్రీడల్లో యువత రాణించాలి



క్రీడలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ మహేశ్‌గుప్తా

శివ్వంపేట(నర్సాపూర్): విద్యార్థులు, యువకులు వారికి నచ్చిన క్రీడల్లో రాణించాలని జెడ్పీటీసీ పబ్బ మహేశ్‌గుప్తా అన్నారు. ఆదివారం మండల పరిధిలోని లింగోజిగూడ గ్రామంలో నర్సాపూర్ నియోజకవర్గ స్థాయి వాలీబాల్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రీడల మానసిక ఉల్లాసానికి దోహదపడుతుందన్నారు. ప్రస్తుతం యువకులు సెల్‌ఫోన్ పోజులో పడి విలువైన సమయాన్ని వృథా చేసుకుంటున్నారని, అలా కాకుండా వారికి నచ్చిన రంగాన్ని ఎంచుకొని ఉన్నతస్థాయికి ఎదగాలని ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ రవినాయక్, బీఆర్ఎస్ నాయకులు బండారి గంగాధర్, చింత స్వామి, సత్తీష్ తదితరులు ఉన్నారు.

'వచ్చేది బీజేపీ ప్రభుత్వమే'



మాట్లాడుతున్న గడ్డం శ్రీనివాస్

మెదక్‌జోన్: వచ్చేది బీజేపీ ప్రభుత్వమే బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని 1వ వార్డు ఔరంగాబాద్‌లో ప్రజాగోస బీజేపీ భరోసా కార్నర్ మీటింగ్ నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా బీజేపీ మెదక్ జిల్లా అధ్యక్షుడు గడ్డం శ్రీనివాస్ హాజరై.. మాట్లాడుతూ.. రానున్న రోజుల్లో పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని, కేసీఆర్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చలేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో పట్టణ అధ్యక్షుడు నాయిని ప్రసాద్ శక్తి కేంద్ర ఇన్‌చార్జ్ పల్లా సత్యం, బూత్ అధ్యక్షుడు మెదక్ పట్టణ నాయకులు, కలిసి నాగరాజు, జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లాల విజయ్ కుమార్, లోకేష్, మెదక్ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

కబడ్డీ పోటీల విజేత కొండాపూర్



బహుమతులు అందిస్తున్న దృశ్యం

పాపన్నపేట(మెదక్): జిల్లాస్థాయి కబడ్డీ పోటీల్లో విజేతగా కొండాపూర్ జట్టు నిలిచింది. మండల పరిధిలోని ఆరేపల్లి గ్రామంలో దొడ్డె నరేందర్‌రావు, రజనీకాంత్ స్మారకార్థం రెండు రోజులు కబడ్డీ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో కొండాపూర్ జట్టు మొదటి స్థానంలో నిలువగా వారికి రూ.30వేల నగదుతో పాటు షీల్డు, రెండో స్థానంలో నిలిచిన పటాన్‌చెరువుకు జట్టుకు రూ.20వేల నగదుతో పాటు షీల్డు, మూడో స్థానంలో నిలిచిన కొడుపాకకు రూ.10వేల నగదుతో పాటు షీల్డు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి, జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్, బీజేపీ నాయకురాలు పరిణీత, శ్రీనివాస్, సర్పంచ్ శ్రీనాథ్ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు.

కొనసాగుతున్న సికింద్లాపూర్ జాతర

స్వామివారిని దర్శించుకున్న సీఎంఓకార్యదర్శి



పూజలు నిర్వహిస్తున్న నర్సింగరావు దంపతులు

శివ్వంపేట(నర్సాపూర్): ఉమ్మడి జిల్లాలో ప్రసిద్ధి చెందిన సికింద్లాపూర్ లక్ష్మీనర్సింహస్వామి జాతర మహోత్సవం కనుల పండువగా కొనసాగుతోంది. ఏటా ధనుర్మాసంలో ప్రారంభమై ప్రతీ ఆదివారం మూడు నెలల పాటు జాతర జరుగుతుంది. అందులో భాగంగా ఈ మహోత్సవానికి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు పవిత్ర కొనేరులో స్నానం ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. కొండపైన కొలువైన లక్ష్మీనర్సింహస్వామిని కాలినడకన వెళ్లి దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు. భక్తులు ఆలయ పరిసరాల్లో గుడారాలు ఏర్పాటు చేసుకొని వంటవార్పు చేపట్టారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు చేసి, అభిషేకం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో ఈఓ శశిధర్, ప్రధాన అర్చకులు ధనుంజయ్‌శర్మ, సీనియర్ అసిస్టెంట్ నర్సింహరెడ్డి, అర్చకులు విద్యాకర్‌చారి తదితరులు ఉన్నారు.

స్వామివారిని దర్శించుకున్న సీఎంఓ కార్యదర్శి

స్వామివారి ఉత్సవాలకు సీఎం కార్యాలయ ప్రధాన కార్యదర్శి సింగాయిపల్లి నర్సింగరావు దంపతులు హాజరవ్వగా.. ఆలయ నిర్వాహకులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఆలయ అభివృద్ధికి తనవంతు సహాయం అందిస్తానని ఈ సందర్భంగా నర్సింగరావు అన్నారు.

ఆలయాల్లో భక్తుల పూజలు



కౌడిపల్లి(నర్సాపూర్): నల్లపోచమ్మదేవి ఆలయంలో పూజలు చేస్తున్న భక్తులు



చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ ఆలయంలో..

కౌడిపల్లి(నర్సాపూర్): మండలంలోని తునికి శ్రీనల్లపోచమ్మదేవి ఆలయంలో ఆదివారం భక్తుల రద్దీ నెలకొంది. వివిధ జిల్లాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం ఆలయం ఈఓ మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో అర్చకులు శివప్ప, రాజేష్ అమ్మవారికి పంచామృతాభిషేకం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. అలాగే భక్తులు అమ్మవారికి బోనాలు తీయడంతో పాటు ఒడి బియ్యం పోసి, మొక్కులు తీర్చుకున్నారు. డప్పు చప్పుళ్లు, శివసత్తుల పూనకాలతో ఆలయ ప్రాంగణం మారుమోగింది. పలువురు భక్తులు అమ్మవారికి తలనీలాలు సమర్పించి, వారి వాహనాలకు పూజలు చేశారు. భక్తులకు మంచినీరు, వసతితో పాటు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆలయ జూనియర్ అసిస్టెంట్ వెంకట్‌రెడ్డి సిబ్బంది తదితరులు ఏర్పాట్లు చేశారు.

చిలప్‌చెడ్(నర్సాపూర్): చాముండేశ్వరీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించామని ఆలయ అర్చకుడు ప్రభాకర్‌శర్మ తెలిపారు. ఆదివారం మండలంలోని చిట్కుల్ శివారులో మంజీరా తీరాన వెలసిన చాముండేశ్వరీ అమ్మవారికి ప్రీతికరమైన కుంకుమార్చన చేసి, ప్రత్యేక పూజలు చేశామన్నారు. ఆదివారం కావడంతో భక్తుల రద్దీ పెరిగింది. అనంతరం భక్తులు అమ్మవారికి ఒడిబియ్యం పోసి మొక్కులు తీర్చుకున్నారు. అర్చకులు భక్తులకు తీర్థ, ప్రసాదాలు అందజేశారు.

రుణమాఫీ అయ్యేనా?

● ఆందోళనలో రైతులు

శివ్వంపేట(నర్సాపూర్): బ్యాంకుల నుంచి లక్షలోపు క్రాప్‌లోన్ తీసుకున్న రైతులకు రుణమాఫీ చేస్తున్నట్లు సాక్షాత్తు సీఎం కేసీఆర్ అసెంబ్లీలో ప్రకటించినా.. ఆచరణలోకి మాత్రం రాలేదు. వివిధ బ్యాంకుల్లో రుణాలు తీసుకున్న రైతులు మాఫీ అవుతాయనే ఉద్దేశంతో చెల్లించలేదు. బ్యాంకు సిబ్బంది మాత్రం తీసుకున్న రుణాలు చెల్లించాల్సిందేనని నోటీసులు జారీ చేస్తూ.. రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నారు. మండల కేంద్రంలోని ఇండియన్ బ్యాంక్ మేనేజర్ పలువురు రైతులకు రుణాలు చెల్లించాలని లోక్ అదాలత్‌కు హాజరు కావాలని కోర్టు నుంచి నోటీసులు పంపించడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. లక్షలోపు రుణామాఫీ చేస్తున్నట్లు ప్రభుత్వం ప్రకటించడంతో రైతులు సంబరపడినా కోర్టు నుంచి నోటీసులు రావడంతో ఏమి చేయాలో తెలియని స్థితిలో రైతులు కొట్టుమిట్టాడుతున్నారు.

రెన్యూవల్ చేయడం లేదు

పూర్వ శివ్వంపేట పంచాయతీ పరిధిలోని 315, 316 సర్వే నంబర్లలోని రైతులకు సంబంధించి ఆలస్యంగా కొన్ని నెలల నుంచి కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు వస్తున్నాయి. పలువురు రైతులకు సంబంధించి ఆన్‌లైన్ నమోదుతో పాటు ధరణిలో భూములు వివరాలు నమోదు అయ్యాయి. అందుకు సంబంధించి కొత్త పట్టాదార్ పాస్‌పుస్తకాలు రావడంలో ఆలస్యం జరుగుతోంది. ధరణిలో భూముల వివరాలు నమోదు ఆధారంగా రుణాలు రెన్యువల్ చేయాల్సి ఉండగా, బ్యాంకు మేనేజర్ తిరస్కరిస్తున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైన జిల్లా ఉన్నత అధికారులు స్పందించి, రుణాల రెన్యువల్ విషయంలో ఇబ్బందులు తొలగించాలి.

లక్షలు వెచ్చించి.. లక్షణంగా వదిలేసి



నిరుపయోగంగా నీటి సంపు

కొల్చారం(నర్సాపూర్): తాగునీటి అవసరాల కోసం రూ.లక్షలు వెచ్చించి చేపట్టిన నిర్మాణాలు అధికారులు పట్టించుకోకపోవడంతో నిరుపయోగంగా మారాయి. కొల్చారం మండలం రంగంపేట ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆవరణలో 2013లో రూ.10లక్షలు వెచ్చించి నీటి సంపును నిర్మించారు. అప్పటి నుంచి సంపును అందుబాటులోకి తీసుకురాలేదు. కేవలం కాంట్రాక్ట్ జేబులు నింపడానికే ఈ నిర్మాణం చేపట్టారనే విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు స్పందించి ట్యాంక్‌ను వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు.

'ఎంపీటీసీలకు నిధులు కేటాయించాలి'

కొండపాక(గజ్వేల్): ఎంపీటీసీలకు నిధులు కేటాయించి ప్రజల్లో చులకన కాకుండా చూడాలని ఎంపీటీసీ మంచాల అనసూయ కోరారు. మండల కేంద్రమైన కొండపాకలో ఆదివారం ఎంపీటీసీ ఆరుట్ల లక్ష్మితో కలిసి విలేకరులతో మాట్లాడుతూ.. గ్రామాభివృద్ధి పనుల నిర్వహణలో కొంత సొమ్మును ఎంపీటీసీల కోటాలో కేటాయించాలన్నారు. గెలిచిన నాలుగున్నర ఏళ్లలో నయా పైసా నిధులు కేటాయించకుండా ఉత్సవ విగ్రహాలుగా చూస్తూ ప్రజల్లో చులకన చేసిందంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామాలకు వచ్చినప్పుడు కనీసం సమాచారం అందించకుండా అగౌరవ పరుస్తున్నారన్నారు. ఎంపీటీసీలకు నిధులు కేటాయిస్తూ గౌరవాన్ని కాపాడాలన్నారు.

ఆర్థికసాయం



ఆర్థికసాయం అందిస్తున్న నాయకులు

మనోహరాబాద్(తూప్రాన్): మండల కేంద్రం మనోహరాబాద్‌కు చెందిన ముస్తాఫా కూతురు వివాహానికి రాష్ట్ర సర్పంచ్‌ల ఫోరం వర్కింగ్ ప్రెసిడెంట్ మహిపాల్‌రెడ్డి తరఫున ఉప సర్పంచ్ వెంకట్‌రెడ్డి రూ.10 వేల ఆర్థికసాయం అందించారు. ఈ కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ వెంకట్‌రెడ్డి, మైనార్టీ నాయకులు జావేద్ పాషా, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు సత్తిరెడ్డి, అనీల్‌రెడ్డి పాల్గొన్నారు.